క్లుప్తంగా

నేడు భట్టిప్రోలులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ పి.ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

క్రిస్మస్ సందడి

భట్టిప్రోలు: గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. పండగను ఆహ్వానిస్తూ మండలంలోని పలు గ్రామాల కూడళ్లలో క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేస్తున్నారు. చర్చిలను అందంగా తీర్చి దిద్దుతున్నారు. చర్చిలకు రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఇప్పటికే సెమీ క్రిస్మస్ పేరిట రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు దుకాణాలు నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలు కొనుగోలుతో కిటకిటలాడుతున్నాయి.

స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటుకు పరిశీలన



రేపల్లె రూరల్: ఈవీఎం మిషన్‌లను భద్రపరిచేందుకు పట్టణంలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్నట్లు ఆర్డీవో హేలాషారోన్ తెలిపారు. ఇందుకు పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో పలు గదులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ విజయసారథి తదితరులున్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొల్లూరు : పోస్టల్ ఉద్యోగుల డిమాండ్లను సత్వరం పరిష్కరించాలని గ్రామీణ తపాల ఉద్యోగుల తెనాలి డివిజన్ అధ్యక్షుడు గోపరాజు జగన్మోహన్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 4వ రోజుకు చేరుకున్న సందర్భంగా.. మండలంలోని బొద్దులూరుపాడు, చింతర్లంక, దోనేపూడి, గాజుల్లంక, క్రాప, పోతార్లంక, రావికంపాడు బ్రాంచ్ పోస్టాఫీసుల్లో పోస్టల్ సేవలు అన్నీ నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను సివిల్ సర్వెంట్‌లుగా గుర్తించడంతో పాటు, కమలేష్ చంద్ర కమిటీ రిపోర్టులోని సానుకూల అంశాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అశోక్‌కుమార్, ఏఐజీడీఎస్ యూనియన్ కార్యదర్శి కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

20 నుంచి వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

రేపల్లె: నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులతో పాటు రెండవ కోర్సుగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో శిక్షణనివ్వబడునని చెప్పారు. మూడు నెలల పాటు యువతకి నైపుణ్య శిక్షణ కల్పించి, అనంతరం స్థానికంగా, ఇతర రాష్ట్రాల్లో ఉన్నటువంటి పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆసక్తి ఉన్నటువంటి యువతి యువకులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 90323 84374 నంబరుకు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కొల్లూరు: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెనాలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీరామ రూరల్ విద్యా సంస్థలో 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో అధిక శాతం కంటి సంబంధిత సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వైద్య శిబిరాల ద్వారా కంటి పరీక్ష శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 4, 5వ తరగతి చదువుతున్న వయస్సులోని చిన్నారుల్లో దృష్టిలోపం అధికంగా కనిపిస్తుందన్నారు. రెండ్రోజుల్లో జరగనున్న శిబిరంలో తెనాలి హెల్త్ వైద్యశాల వైద్య సిబ్బంది సహాయ, సహకారాలతో ప్రతి విద్యార్థికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, సభ్యులు మల్లాది అర్జున, డి.మురళీకృష్ణ, వైద్యులు షేక్ సైదావలి, సిబ్బంది షేక్ సుభాని, గోవర్ధన్, భవాని, ప్రసన్న పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తి ఆదర్శం

బాపట్ల: తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం చారిత్రక అవసరమని పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారని వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలలో జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు పాల్గొని, మాట్లాడారు. తమిళం మాట్లాడే మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి ప్రత్యేక తెలుగు మాట్లాడే రాష్ట్ర ఏర్పాటుకు 56 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన జీవితాన్ని త్యాగం చేసి, పొట్టి శ్రీరాములు అమరుడయ్యారన్నారు. ఆయన చేసిన నిరుపమానమైన త్యాగం వల్ల ఆంధ్రుల ఆత్మగౌరవం పరిరక్షించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, డా, సీహెచ్ సంధ్యా రాణి డా,.ఎం.లత, డా, కె.విజయ్ ప్రకాష్, డా.షేక్ హసీనా బేగం, సీనియర్ ప్రొఫెసర్లు డా. బి. విజయాభినందన, డా,.ఎస్ఆర్ కోటేశ్వర రావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర ప్రజల కోసం చేసిన త్యాగం మరవలేనిదని ఆహార సాంకేతిక కళాశాల డీన్ డాక్టరు వై.రాధ పేర్కొన్నారు. కళాశాల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ విమల, డాక్టర్ బ్లేస్సి సాగర్ నిర్వహించారు. ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టరు డీడీ స్మిత్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు.

పొట్టి శ్రీరాములు ఆశయాలు ఆదర్శం

నిజాంపట్నం: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలను నేటి యువతరం ముందుకు తీసుకెళ్లాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు అద్దేపల్లి లక్ష్మీనరసింహారావు కోరారు. అడవుల దీవిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆనంద్ కుమార్, అద్దేపల్లి శ్రీను, అద్దేపల్లి కోటేశ్వరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

భట్టిప్రోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వారికి చిత్రపటాలకు, విగ్రహాలకు ఎంపీపీ



వ్యవసాయ కళాశాలలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు

దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, కార్యాలయ సూపరింటెండెంట్ జలజ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్, నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే వాసవిక్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయాల సముదాయం, రథం సెంటర్, భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లోని పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేశారు.

త్యాగనిరతి అమోఘం

కర్లపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగనిరతి అమోఘమైనదని పొట్టి శ్రీరాముల స్మృతి సేవా పరిరక్షణ సమితి మండలాధ్యక్షుడు బొలిశెట్టి రాంబాబు తెలిపారు. పొట్టి శ్రీరాముల 71వ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాముల స్మృతి సేవా పరిరక్షణ సమితి కార్యదర్శి కోడూరి చంద్రశేఖర్‌రావు, వాసవీక్లబ్ ట్రెజరర్ ఎం.గోపి, వాసవీ క్వీన్స్ క్లబ్ ట్రెజరర్ ఎం.రాజేశ్వరి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు కె.రామకృష్ణారావు, టి.విజయకుమార్, పి.సోమశేఖర్‌రావు, ఎస్.కేశవరావు, ఎన్.మణికంఠ, టి.హేమంత్ తదితరులు ఉన్నారు.

పొట్టి శ్రీరాముల ఆశయాలు ఆదర్శం

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలు ఆదర్శవంతమైనవని పిట్టలవానిపాలెం శాఖ గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ మున్నం చిన సుబ్బారెడ్డి తెలిపారు. గ్రంథాలయంలో పొట్టి శ్రీరాముల వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చిన సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాముల త్యాగనిరతి అందరూ గుర్తుంచుకోవాలని చెప్పారు. శాఖ గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, నాయకులు తూనుగుంట్ల శ్రీనివాసరావు, జి.రామారావు, ఎన్.ఏడుకొండలు, బి.సుబ్బరాజు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు



పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళులర్పించిన ఆర్యవైశ్యులు



పీవీపాలెం గ్రంథాలయంలో..

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను సందర్శించిన మండల నోడల్ సైన్స్ ఆఫీసర్ అంబటి జాకబ్



భట్టిప్రోలు హైస్కూల్‌లో మానవ అస్థిపంజరం

భట్టిప్రోలు: మండలంలోని హైస్కూళ్లలో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు. వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను ప్రధానోపాధ్యాయురాలు కె. అరుణకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాకెట్ లాంచ్ ప్రయోగం, రోబో మ్యాన్, మినీ గ్యాస్ వెల్డింగ్ మిషన్, మూత్ర పిండాలే. 3- ఆర్ రూల్స్‌ను సూచించే ప్రాజెక్ట్, యాసిడ్ వర్షాలు, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ప్రయోగాలు ఎంతగానో ఆకర్షించాయి. ఈ ఎగ్జిబిషన్‌ను మండల నోడల్ సైన్స్ ఆఫీసర్ అంబటి జాకబ్ పరిశీలించారు. కన్వీనర్‌గా రెడ్డి సుధాకర్, కో-ఆర్డినేటర్లుగా గుర్రం మురళీమోహన్, కె. శివరామకృష్ణ వ్యవహరించారు. టీఎం రావు హైస్కూల్‌లో మానవ అస్థిపంజరం, వివిధ అవయవాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు పర్యవేక్షించారు. ఐలవరం, పల్లెకోన పెదపులివర్రు, పెసర్లంక, సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూళ్లలో సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు.

వైకల్యాన్ని జయించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రేపల్లె రూరల్: వైకల్యమనేది కేవలం శరీరంలోని ఒక భాగమేనని, ఆ వైకల్యాన్ని జయించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీడీవో శివపార్వతి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని భవిత స్కూలులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. దివ్యాంగులమన్న భావన కనీసం మనస్సులోకి కూడా రానివ్వరాదన్నారు. హెలెన్‌కెల్లర్, స్టీఫెన్ హాకిన్స్, లూయిస్ బ్రెయిలీ, సుధాచంద్రన్ వంటి అనేక మంది తమ వైకల్యాన్ని జయించారని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన టాబ్‌లను అందజేశారు. విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత బస్‌పాస్‌లను అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జానం మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, ఎంఈవోలు కేసనశెట్టి సురేష్, కె.రత్నశ్రీధర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, భవిత స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్ ఎస్.అనురాధ, సుఖన్య, ఉపాధ్యాయురాలు పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలి

ఆర్డీవో హేలా షారోన్

రేపల్లె రూరల్: విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని, నాణ్యత ఏ మాత్రం లోపించినా సహించేది లేదని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. పేటేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఎక్కువగా పేదవారే ఉంటారని, వారికి నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున నూరుశాతం ఫలితాలు సాధించే విధంగా ప్రత్యేక దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం తరగతి గదిలోవిద్యార్థులను వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరావు, హెచ్ఎం సీహెచ్ బాబూజీ, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలు పరిష్కరించాలి

ఏఐజీడీఎస్‌యూ డివిజనల్ సెక్రటరీ విజయ్‌బాబు

రేపల్లె: గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐజీడీఎస్‌యూ డివిజనల్ సెక్రటరీ కె.విజయ్‌బాబు కోరారు. గ్రామీణ సేవక్‌ల సమస్యల పరిష్కారానికి ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ), నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ (ఎన్‌యుజీడీఎస్)ల సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరధిక సమ్మెలో భాగంగా పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ ప్రధాన కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొని, మాట్లాడారు. డాక్ సేవక్‌లకు సివిల్ సర్వెంట్ హోదా వెంటనే ఇవ్వాలన్నారు. కుటుంబ సభ్యులతో సహా వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ చేసిన సిఫార్సును అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌యూజీడీఎస్ తెనాలి డివిజన్ సెక్రటరీ జి.అశోక్‌కుమార్, యూనియన్ నాయకులు తిరుమలరావు, సాయిప్రసాద్, భాగ్యరాజ్, శివయ్య, యు.సత్యనారాయణ, రవిప్రసాద్ పాల్గొన్నారు.



నిరవధిక సమ్మెలో పాల్గొన్న గ్రామీణ డాక్ సేవక్‌లు

సహాయం చేయడమే నిజమైన క్రిస్మస్



నగ్రావారిపాలెం(కర్లపాలెం): ఇతరులకు సహాయం చేయడమే నిజమైన క్రిస్మస్ అని రెవరెండ్ వి.ఇమాన్యుల్ అన్నారు. గ్రామంలోని పెనుయేలు ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన దైవ సేవకుల సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. 50 మంది దైవ సేవకులకు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుయేలు ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు కాగిత డేవిడ్ దైవ సేవకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

కాకాని శివాలయంలో శాస్త్రోక్తంగా యాగాలు ప్రారంభం

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక సప్తమ సహస్ర చండీ, మహా రుద్ర , నవగ్రహ, లక్ష్మీ, గణపతి మహా యాగాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. తెనాలికి చెందిన విష్ణుభట్ల ఆంజనేయచయనులు పర్యవేక్షణలో శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు పూజా క్రతువు నిర్వహించనున్నట్లు ఏసీ తెలియజేశారు. తొలిరోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు గురువందనం, గోపూజ, యాగ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీగణపతి హోమం, చండీపారాయణములు, అఖండ దీపారాధన, జపాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మంటపారాధనలు, కుండ సంస్కారం, అగ్నిప్రతిష్టాపన, మూలసూత్ర హోమం, సహస్ర చండీ సప్తశతి హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో 50 మందికి పైగా ఋత్వికులు పాల్గొన్నారు.



యాగాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆలయ ఏసీ, చైర్మన్ తదితరులు

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పట్టెం



రేపల్లె: వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పట్టెం శ్రీనివాసరావును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావుకు, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి, పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు.

దేశాన్ని ఏకీకృతం చేసిన పటేల్



బాపట్ల అర్బన్: స్వాతంత్ర భారత నిర్మాణంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ అద్వితీయమైన పాత్ర పోషించారని ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు అన్నారు. శుక్రవారం ఫోరమ్ ఆధ్వర్యంలో పటేల్ నగర్‌లో వల్లభాయ్ పటేల్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతకు కృషి చేసిన వారిలో అగ్రగన్యుడు పటేల్ అని కొనియాడారు. పోస్ట్ మాస్టర్ రాంబాబు, పురపాలక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు లక్ష్మీసుజాత, సాంబయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపు

ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్ని అన్ని హంగులతో ఆధునీకరించిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలకు కొత్త రూపం తెచ్చారని, ఆధునిక డిజిటల్ చదువుల్ని తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాడు-నేడుతో పాఠశాలలో కల్పించిన వసతులు, ఆధునీకరించిన పాఠశాల భవన సముదాయాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లో డ్యూయల్ డెస్కులు, ఐఎఫ్ ప్యానెల్స్ పనితీరును ప్రత్యక్షంగా తిలకించారు. ప్రభుత్వ పాఠశాలల్ని గతంలో తాము ఎన్నడూ ఇంత గొప్పగా, ఇన్ని వసతులతో చూడలేదని అన్నారు. తరగతి గదుల్లో ఆధునిక ఫర్నీచర్, ఐఎఫ్ ప్యానెల్స్‌తో పాటు విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్లతో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుంటున్నారని తెలిపారు. బ్లాక్ బోర్డు స్థానంలో ఐఎఫ్ ప్యానల్స్ ద్వారా ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్న తీరు అద్భుతంగా ఉందని చెప్పారు. పేద విద్యార్థుల జీవితాలను మార్చే ఆధునిక డిజిటల్ టెక్నాలజీలతో కూడిన ఇంగ్లిష్ మీడియం చెప్పిస్తున్న సీఎం వై.ఎస్. జగన్ రాష్ట్రంలో చదువుల విప్లవం తెచ్చారని ప్రశంసించారు. అనంతరం పాఠశాలలో గార్డెన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. విజయలక్ష్మి, ఉర్దూ డీఐ షేక్ మొహ్మద్ ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మితో మాట్లాడుతున్న అంబటి రాయుడు

విద్యుత్ పొదుపుతో బహుళ ప్రయోజనాలు

సీఆర్డీప సర్కిల్ ఏడీ కోటేశ్వరరావు

తాడికొండ: విద్యుత్‌ను పొదుపుగా వాడటం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని సీఆర్డీయే సర్కిల్ విద్యుత్ శాఖ ఏడీ కేపీ కోటేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా తాడికొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్‌ను ఆదా చేసే పలు పద్ధతులు వివరిస్తూ ఫిలమెంట్ బల్బులు వాడకం పూర్తిగా తీసివేసి ఎల్ఈడీ స్టార్ రేటింగ్ బల్బులు, ఫ్యానులు వినియోగించాలని కోరారు. ఏసీని 25లో పెట్టి వినియోగించడం, 3 స్టార్, 4 స్టార్ రేటింగ్ ఏసీలు వినియోగించాలని, ఏసీ, టీవీ రిమోట్ ద్వారా కాకుండా స్విచ్‌ను కట్టివేయాలని పేర్కొన్నారు. పలువురు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు స్టార్ రేటింగ్ ఎల్ఈడీ బల్బులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఈ రవి కుమార్, సబ్ ఇంజినీర్ నామా నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు జమ్ములపాలెం విద్యార్థి ఎంపిక

బాపట్ల: మండలంలోని జమ్ములపాలెం ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నర్రా నరేష్ జాతీయ హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావటం ఎంతో సంతోషమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి.కృష్ణారావు అన్నారు. ఈ మేరకు నర్రా నరేష్‌ను పాఠశాలలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వి.వి.కృష్ణారావు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బి.సురేష్, సర్పంచ్ బోయిన వెంకటేశ్వరమ్మ, గ్రామపెద్దలు పువ్వాడ బసంత్‌కుమార్, వై.సుబ్బారావు, పీడీ బి.వీరచంద్ర తదితరులు ఉన్నారు.



నరేష్‌ను అభినందిస్తున్న హెచ్ఎం కృష్ణరావు, పీడీ

డోకిపర్రు ఉర్దూ పాఠశాల తనిఖీ

మేడికొండూరు: మండల పరిధిలోని తురకపాలెంలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాల ఉప తనిఖీ అధికారి ఎం.డి.ఖాసిం శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మూల్యాకనం చేసిన సమ్మెటీవ్ అసెస్‌మెంట్ పరీక్ష పత్రాలను విద్యార్థులకు ఇచ్చారు. శనివారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అమ్మ ఒడి అర్హులకు విద్యార్థుల హాజరు పరిగణలోకి తీసుకోవడం జరుగుతోంది, కాబట్టి తల్లిదండ్రులకు దీనిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మీజ్వాలా, అజీజ్, అయేషా, జాస్మిన్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎం.డి.ఖాసీఎం

భార్యాభర్తల వివాదంపై కేసులు నమోదు

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): భార్యభర్తల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీయడంతో ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులపై వేర్వేరుగా కేసులు నమోదు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. పెదగొట్టిపాడుకు చెందిన యలమంచిలి శ్రీనుకు అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మతో 36 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మనస్పర్థలు రావడంతో కొన్ని సంవత్సరాలుగా విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీను మరొక మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈనెల 14న శ్రీను సహజీవనం చేస్తున్న మహిళతో తన ఇంట్లో ఉన్నాడు. విషయం తెలుసుకున్న భార్య వెంకటేశ్వరమ్మ బంధువులు ఇదేమని శ్రీనును ప్రశ్నించారు. మాటామాటా పెరిగి ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. భార్యాభర్తలు పోలీస్ స్టేషనులో వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదులు చేశారు.

నేడు సినీ దర్శకుడు అనిల్ రావిపూడికి పురస్కారం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గల స్వామి వివేకానంద సెమినార్ హాలులో శనివారం సుప్రసిద్ధ చిత్రకారుడు, దర్శకుడు బాపు జయంతి సందర్భంగా 'బాపు-రమణ-బాలు కళాపీఠం' నిర్వహణలో బాపు స్మారక పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ రమణ యశస్వి ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సభలో సినీ దర్శకులు అనిల్ రావిపూడికి బాపు స్మారక దర్శక కేసరి పురస్కారం, ప్రసిద్ధ చిత్రకారులు చిదంబరం, రామశాస్త్రి, కార్టూనిస్టు బొమ్మనకు బాపు స్మారక పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు, కార్టూనిస్టులు, చిత్రకారులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని, చుక్కపల్లి వారి పాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా దుగ్గిరాల గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి గ్యాస్‌స్టౌవ్, సిలెండర్, రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు సిద్ధిల ఉజ్వల శ్రీహరిణి, దాసరిసుందరమ్మ, ఈమని 1వ ఎంపీటీసీ సభ్యులు పి. కృష్ణ చైతన్య, ఈమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవల్లి, వ్యవసాయశాఖ గుంటూరు జిల్లా ఆత్మ పీడీ రామాంజనేయులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ భవాని, ఎయిడ్స్ వైద్యురాలు రష్మిత, ఏపీఎం మహాలక్ష్మి పాల్గొన్నారు.